క్లుప్తంగా

అధినేతను కలిసిన మనోజ్‌రెడ్డి


మాజీ సీఎం జగన్‌తో మనోజ్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మనోజ్‌రెడ్డి కలిశారు. మంగళవారం తాడేపల్లె కార్యాలయంలో యువత విభాగం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి నివాళి


మొగిలయ్యకు నివాళులు అర్పిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

బంగారుపాళెం: మండలంలోని శెట్టేరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మొగిలయ్య మృతికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ నివాళులు అర్పించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మొగిలయ్య గ్రామంలో పార్టీకి అండగా నిలిచారని, ఆయన మరణం బాధాకరమన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, బీసీ నాయకుడు మార్కొండ ఉన్నారు.

కనిపించే దేవుళ్లు.. వైద్యులు


డాక్టర్లను సన్మానిస్తున్న వక్తలు

గుడిపాల: సమాజంలో అత్యంత పవిత్రమైన కీలకమైన వృత్తి వైద్యం.. ఆపద సమయంలో మనకు ఆపద్బాంధవుడిలా ప్రాణంపోసే వైద్యులు కనిపించే దేవుళ్లతో సమానమని వక్తలు కొనియాడారు. మంగళవారం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిపాలలో ప్రజలకు విశిష్ట వైద్యసేవలు అందిస్తున్న గుడిపాల డాక్టర్ సంధ్య, బొమ్మసముద్రం డాక్టర్ రష్మితను సన్మానించారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజలకు చేసిన సేవలు మరువలేని వన్నారు. వైద్య వృత్తిని అంకితభావంతో నిర్వహించాలని జూనియర్ వైద్యులకు సూచించారు.

ఘనంగా డాక్టర్స్ డే


కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న డాక్టర్లు

తవణంపల్లె: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జాతీయ డాక్టర్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ కేశవనారాయణ చేతుల మీదుగా కేక్‌కట్ చేసి వైద్యసిబ్బందికి పంచిపెట్టారు. అనంతరం వారికి పీహెచ్‌సీ సిబ్బంది శాలువలు కప్పి, పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు.

విద్యామిత్ర కిట్లను సద్వినియోగం చేసుకోండి


ఉపాధ్యాయులకు షూలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: సర్వేపల్లె రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ హేమలత తెలిపారు. మంగళవారం తవణంపల్లె ఎమ్మార్సీలో విద్యామిత్ర కిట్లను ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. మండలంలోని 64 పాఠశాల్లోని పిల్లలకు షూలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తామన్నారు. పేదపిల్లల తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.


పూతలపట్టులో గుజ్జు పరిశ్రమ వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు


నేల రాలిన మామిడి పంట

బాబొస్తే పతనమే..

జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మునుపెన్నడూ లేని రీతిలో మామిడి ధరలు నేల చూపులు చూస్తుండడంతో రైతులు దిక్కుతోచక అయోమయ స్థితిలో పడ్డారు. రైతన్నకు ఆపన్న హస్తం అందించాల్సిన కూటమి ప్రభుత్వం ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. కరోనా లాంటి విపత్కర సమయాల్లో కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మామిడికి మద్దతు ధర ఇచ్చి ఆదుకుంటే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాత్రం చేతులెత్తేసింది. సీఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు అయినా ఈ జిల్లా రైతాంగాన్ని ఆయన ఎప్పుడూ ఆదుకున్న దాఖలాలు లేవని మామిడి రైతులు బహిరంగంగానే చెబుతున్నారు.

- ఎప్పుడు చంద్రబాబు అధికారం చేపట్టినా మామిడి రైతుపై వివక్షే
- కరోనా సమయంలోనూ మద్దతు ధర ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఇప్పుడు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం
- చెట్లల్లోనే కాయలను వదిలేస్తున్న వైనం
- మరోవైపు భారీ చెట్లను నరికేవస్తున్న రైతులు

యాదమరి : రైతు సంక్షేమం కోసం కృషి చేస్తామని ఊకదంపుడు ప్రసంగాలు ఇచ్చే సీఎం చంద్రబాబు తన సొంత జిల్లాలో రైతులకు చేసిందేమీ లేదు. ఆయన ఎప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నా కూడా రైతులకు అన్యాయమే జరిగింది తప్పా ఒనగూరిందేమీ లేదని పలువురు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు మామిడి రైతులకు లాభాలు రాగా.. ఈ దఫా మాత్రం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బపడింది. మామిడికి గిట్టుబాటు ధర కల్పించే విషయంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం పెద్దగా ఆసక్తి కనబరచిన దాఖలాలు లేవని.. గత చేదు అనుభవాలను రైతులు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం వస్తే మామిడి ధరలు పాతాళానికి పడిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నామని పలువురు మదన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కరోనా మహమ్మారి సంక్షోభంలో కూడా మామిడి రైతు నష్టపోకూడదని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుజ్జు పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి రైతులకు లబ్ధి చేకూర్చారు. గత ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ కూడా రూ.15కు తగ్గకుండా మామిడికి గిట్టుబాటు ధర అందేలా గట్టిగా చర్యలు తీసుకున్నారు. దీంతో మామిడి రైతులు సంతోషంగా ఉండేవారు. ఎప్పుడైనా గుజ్జు పరిశ్రమల వారు ధర విషయంలో చేతివాటం ప్రదర్శిస్తే స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే వెళ్లి సమస్యను పరిష్కరించి రైతుకు అండగా నిలబడేవారు. కానీ ఈ ప్రభుత్వ హయాంలో అందుకు పూర్తి భిన్నంగా మారింది. సీజన్ ఆరంభంలో జిల్లా పర్యటనకు వచ్చిన వ్యవసాయశాఖ మంత్రి మామిడికి రూ.8 గిట్టుబాటు ధర ఇచ్చేలా ప్రభుత్వం గుజ్జు పరిశ్రమల యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చామన్నారు. పరిశ్రమల యాజమాన్యం సిండికేటుగా మారి ధరలను రూ.3 నుంచి రూ.5కు దించేశారు. దీంతో మద్దతు ధర కోసం రైతన్నలు రోడ్డెక్కి నిరసనలు, ఆందోళనలు ప్రదర్శించినా స్థానిక ప్రజాప్రతినిధుల్లో చలనం రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మామిడి కాయలను చెట్లలోనే వదిలేసిన రైతులు

నిస్సహాయ స్థితిలో రైతులు..

సాక్షాత్తు జిల్లా కలెక్టరే స్వయంగా పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించి రైతులకు మద్దతు ధర ఇవ్వాల్సిందే అని హెచ్చరికలు జారీ చేసినా కూడా మార్పు రావడం లేదు. కొన్నిచోట్ల ఎంత ధర ఇస్తున్నారో కూడా వెల్లడించకపోవడంతో రైతులు నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు. కొందరు రైతులు ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద రోజుల తరబడి నిరీక్షించలేక ర్యాంపులు, మండీలను ఆశ్రయిస్తున్నారు. అక్కడ దళారుల చేతిలో దగాకు గురవుతున్నారు. వారిచ్చే రూ.2 కోత కూలీలకు సైతం రావడం లేదని వాపోతున్నారు. దీంతో కొంతమంది రైతులు కాయలను చెట్లల్లోనే వదిలేస్తున్నారు. గతంలో మునుపెన్నడూ లేని రీతిలో ప్రస్తుత ప్రభుత్వ నిర్వాకం వల్ల రైతులు.. తాము పెంచి పెద్ద చేసిన మామిడి చెట్లను చేతులారా నరికేస్తున్నారు. రైతును రాజును చేస్తామని ఉత్తర ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వ పెద్దలు ఈ కష్ట సమయంలో ఆదుకోకపోవడంతో రైతులు దుమ్మెత్తి పోస్తున్నారు. మామిడి రైతాంగంపై కూటమి ప్రభుత్వ తీరు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మామిడి పంట ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

గతంలో ఎప్పుడూ ఇలా లేదు..



గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ కూడా మామిడి ధరలు ఇలా పతనమవ్వలేదు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఉదారంగా ఆదుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారం చేపట్టినా మామిడికి మద్దతు ధర కల్పించడంలో విఫలమవుతూనే ఉంది.
- మనోజ్‌రెడ్డి, మోర్దానపల్లి

ప్రశ్నార్థకంగా మామిడి



మామిడి పంటపై ప్రభుత్వ తీరు ఇలానే కొనసాగితే భవిష్యత్తులో పంట ఉండనివ్వాలా ? వద్దా ? అనే సందేహంలో పడుతున్నాం. ఈ పరిస్థితుల్లో వ్యవసాయం చేయాలంటేనే భయమేస్తోంది.
- శ్రీనివాసులు, దళవాయిపల్లి

పట్టించుకునే వారు కరువయ్యారు



మామిడి కాయలు లోడుతో వచ్చి మూడురోజులైంది. ఇంతవరకు పట్టించుకునే వారు కరువయ్యారు. తిండీతిప్పలు లేక అల్లాడుతున్నాం. భోజనం చేయాలన్నా, నీరు కావాలన్నా కిలోమీటర్‌పైన వెళ్లాల్సి వస్తోంది. అన్‌లోడింగ్ ఎప్పుడు అవుతుందో చెప్పే నాదుడే లేదు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం -రామయ్య, కొట్టాలం, యాదమరి మండలం

భయంగా ఉంది..



తాగునీరు, భోజనం కావాలంటే కిలోమీటర్ల దూరం వెళ్లాలి. ఇప్పటికే వచ్చి మూడు రోజులైంది. ఇంకా రెండురోజులు అవుతుందంటున్నారు. రాత్రివేళలో నిద్రపట్టడం లేదు. పక్కనే దట్టమైన అటవీప్రాంతం ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. రహదారి పక్కనే ట్రాక్టర్లను పార్కింగ్ చేయిస్తున్నారు. -హేమచంద్ర, కొట్టాల,యాదమరి మండలం.

ఆర్టీఓ కార్యాలయంలోనే ఎఫ్‌సీ ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీఓ కార్యాలయంలోనే వాహనాల ఎఫ్‌సీలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరంలో ఎఫ్‌సీలు చేయకుండా చిత్తూరుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉండే నలగంపల్లె వద్ద ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడాన్ని ఖండించారు. ఇక్కడ ప్రభుత్వానికి సంబంధించిన విశాలమైన స్థలంలో ప్రస్తుతం ఎఫ్‌సీలు చేస్తున్నారన్నారు. అది కాదని బైక్‌ల నుంచి లారీలు, హెవీ వెహికల్, టిప్పర్లు, ప్రైవేటుబస్సులు, ఆర్టీసీ బస్సులతో పాటు అక్కడికెళ్లి చేసుకోవాల్సిన అవసరం ఏమిటి అన్నారు. తద్వారా పెట్రోలు, డీజిల్ అదనంగా ఖర్చు కావడమే కాకుండా టోల్ గేట్ ఫీజుల పేరిట మరో భారం పడుతుందన్నారు. ఎఫ్‌సీలు చేసుకునే సందర్భంలో ఏదైనా తప్పు దొర్లితే మరొక రోజు వేచి ఉండాల్సి వస్తుందన్నారు. అప్పుడు భోజన, వసతి సదుపాయాల కోసం కేజీ సత్రం, బంగారుపాళెం పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కోట్లాది రూపాయలతో వాహనాలకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయంలో ఎఫ్‌సీలు కాదనడం అన్యాయమన్నారు. ఈ ప్రక్రియను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం ఎంతవరకు న్యాయం ? అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులకు, ప్రైవేటు వ్యక్తులు పని చేయడానికి ఎంతో తేడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మణి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన

పూతలపట్టు(యాదమరి): డెంగ్యూ జ్వరంపై సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జాతీయ డెంగ్యూ మాసోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నా రు. టైగర్ అనే దోమ మంచి నీటిలో వృద్ధి చెంది పగటి సమయంలో దాడి చేస్తుందని తెలిపారు. ఈ దోమల కాటు వల్ల ప్రాణాంతక డెంగ్యూ జ్వరం వ్యాప్తి చెందుతుందన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ లక్ష్మీప్రసాద్, సూపర్‌వైజర్ ధర్మేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గుండాలమ్మ జాతర


కొలువుదీరిన అమ్మవారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని అశోక్‌పురంలో మంగళవారం గుండాలమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా వేకువజామున ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆలయ ఆవరణలో అమ్మవారిని కొలువుదీర్చి తొలిపూజ చేశారు. భక్తులు ఊరేగింపుగా వచ్చి అంబలి పోశారు. రాత్రి పిండివంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి


మాట్లాడుతన్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: ఖరీఫ్ పంటల సాగులో తప్పనిసరిగా విత్తనశుద్ధి పాటించాలని, ఇలా చేయడం వల్ల పంటలకు చీడపీడలు ఆశించవని ఏఓ వరలక్ష్మి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మిట్టూరు, పుత్రమద్ది గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వర్షాలు కురిసి భూమిలో తేమ ఉన్నప్పుడే విత్తనం వేసుకోవాలన్నారు. సబ్సిడీపై పొందిన విత్తనాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో అంతర పంటలుగా కంది, అలసంద, పెసర తదితర పంటలను సాగు చేసుకోవాలన్నారు. దీంతో చీడపీడల ఉధృతి తగ్గడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. ప్రతి రైతుకు ప్రతి పథకం లబ్ధి పొందేలా అవగాహన కల్పించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉద్దేశమన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి నగదు బిల్లు పొంది భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

అంతర పంటల సాగు లాభదాయకం

తవణంపల్లె: అంతరపంటల సాగుతో రైతులకు ఎంతో లాభదాయకమని వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ తెలిపారు. మంగళవారం మండలంలోని పల్లెచెరువు పంచాయతీలోని జెట్టిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ మాట్లాడుతూ రైతులు మామిడి పంట సాగు కంటే అంతర పంటల సాగు మంచిదన్నారు. అంతర్‌పంటల వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు మంచి ఆదాయం వస్తోందన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని తదనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటలపై అవగాహన కల్పించారు. అనంతరం జెట్టిపల్లెలో పల్లవి అనే మహిళా రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన వంకాయ పంట సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే స్ఫూర్తితో రైతులు అంతరపంటల సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్, ఆర్ఎస్‌కే సిబ్బంది, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది పల్లవి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి


గుడిపాల: పేయనపల్లెలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ

గుడిపాల: రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. మంగళవారం ఆమె వసంతాపురం, పేయనపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న పంటలకు ముందుగా పొలంలో నవధాన్య విత్తనాలు చల్లాలని సూచించారు. దీని వల్ల భూమిలో వివిధ రకాల సూక్ష్మ జీవులు వృద్ధి చెందడంతో పాటు కర్బనశాతం చేరడంతో పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయశాఖ రాయితీపై సరఫరా చేసిన విత్తనాలను రైతులు విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని తెలిపారు. ప్రతి రైతు పంటల బీమాను చేసుకోవాలని సూచించారు.

భక్తులతో బోయకొండ కిటకిట



చౌడేపల్లె: ఆషాఢ మాసం మంగళవారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కోర్కెలు ఫలించిన భక్తులు మొక్కులు చెల్లించారు. క్యూలన్నీ రద్దీతో కిక్కిరిశాయి. దాదాపు 15 వేల మంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు.

మాధవ్‌కు కాణిపాకం ప్రసాదం

చిత్తూరు కార్పొరేషన్: నిరంతర కృషి, పోరాటాలతో పీవీఎన్ మాధవ్ ప్రస్థానం మొదలైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు చిట్టిబాబు తెలిపారు. మంగళవారం విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లా నుంచి పలువురు నాయకులతో కలిసి వెళ్లి అభినందించామన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఎదిగి, విశాఖ కృష్ణా కళాశాలలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఏబీవీపీ జెండా ఎగురవేశారన్నారు. ఆయనను కలిసి కాణిపాక ప్రసాదం, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

6న గురుపూర్ణిమ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని రామకృష్ణ ఆశ్రమంలో ఈ నెల 6వ తేదీన సిద్ధ సమాధి యోగా గురుపూర్ణిమ మహోత్సవం జరుగుతుందని యోగాచార్యులు నరేంద్రకుమార్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు నగరంలోని ఈశ్వరగుడి వీధిలో ఉన్న రామకృష్ణ ఆశ్రమంలో 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా అరగొండ వద్ద ఉన్న శివగిరి ఆశ్రమ పీఠాధిపతి అప్రమేయానందగిరి స్వామి విచ్చేస్తారన్నారు. వ్యాస పూర్ణిమ విశిష్టత అనుగ్రహ భాషణం చేస్తారన్నారు. కార్యక్రమంలో ధ్యానులతో పాటు, నగరవాసులు పాల్గొనాలని ఆయన కోరారు.

సారూ..కాలువ నిర్మించరు..!


నిల్వ ఉన్న మురుగునీరు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక వరిగపల్లె హరిజనవాడలో నూతన కాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పదేళ్ల కిందట ఈ ప్రాంతంలో కాలువను నిర్మించారు. ప్రస్తుతం నివాసాలు పెరగడంతో అందులోని నీరు రోడ్డు పైకి వచ్చి ఇళ్ల ముందు నిల్వ ఉంటోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతూ అంటురోగాలు ప్రబలుతున్నాయని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. కాలువను మరింత విస్తరిండమో.. లేదంటే కొత్తగా కాలువ నిర్మించాలని కోరుతున్నారు. ఇదే సమస్యపై తాము పలుమార్లు సచివాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. ఉన్నతాధికారులైనా తమ సమస్యపై దృష్టి సారించి స్పందించాలని కోరుతున్నారు.

పాఠశాలకు దాత సాయం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని వరదప్పనాయుడు నగరపాలక పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు దాత పార్థసారథి నాయుడు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం తమవంతు సాయంగా రూ.15 వేలను పాఠశాల హెచ్ఎంకు అందజేశారు. స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడకుండా నీటి కొళాయిలు, క్యాన్లు మరమ్మతులు చేయించాలని కోరారు.